# బాధిత కుటుంబానికి యువశక్తి యూత్ ఆర్థిక సహాయం



రాయపర్తి, అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని కొత్త రాయపర్తి కాలనీకి చెందిన గారె బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం సమాచారం తెలుసుకున్న యువశక్తి యువజన సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అనంతరం 17, 816 రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యువశక్తి యువజన సంఘం అధ్యక్షులు గారె వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి గారె మధు, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, గౌరవ అధ్యక్షులు మాచర్ల పరమేశ్, ఉపాధ్యక్షులు గారె నరేష్, బడితపురం రాజు, గారె మహేందర్, గారె బాబు, గారె కృష్ణ, గారె బాబు, క%శీ%జర్ల శ్రీనివాస్, గారె సంపత్, గారె సాగర్, గారె దయాకర్, గారె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డిని పరామర్శించిన మండల పార్టీ నాయకులు



రాయపర్తి, అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త): పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రమాదానికి గురై ఇటీవల గాయపడ్డారు. గురువారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఝాన్సీ రెడ్డి నివాసంలో గత కొద్ది రోజుల క్రితం ప్రమాదనికి గురై, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్న పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు, ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిని ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు భూక్య సమ్మయ్య నాయక్, మండల ముఖ్య నాయకులు ఏసి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కూందురు విక్రమ్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, గూగులోతు శ్రీనివాస్, మచ్చ రమేష్, కుంట రాజు, భాస్కర్, కిషన్ నాయక్, పీరాని ప్రవీణ్, చెగో%శీ%డా సాయికుమార్, బక్కతట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదానం పేరుతో గ్రామంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేసిన వయోవృద్ధులు



చెన్నారావుపేట, అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త): సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా చెన్నారావుపేట గ్రామంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం వారు గురువారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులను శుభ్రంగా చేశారు. ఊడ్చిన చెత్తను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, సంఘ సభ్యులు కంది నారాయణరెడ్డి, వరంగంటి మల్లయ్య, పత్తి సంజీవరెడ్డి, వరంగంటి కమారస్వామి, గట్ల కృష్ణ, ములుక అయిలయ్య, సిద్ధ కుమారస్వామి, తాళ్లపల్లి కొమ్మలు, కాసుల ఉపేంద్ర చారి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి ప్రకృతిని ఆరాధించడం గొప్పవరం

**- వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ**



**వర్ధన్నపేట, అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త):** ప్రకృతిలోని తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి, అందరూ చల్లగా ఉండాలని కోరుతూ ప్రకృతిని ఆరాధించడం గొప్ప వరమని వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ అంగోత్ అరుణ అన్నారు. గురువారం బతుకమ్మ చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే కౌన్సిలర్ తోటకు రాజమణి నివాసంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంగోత్ అరుణతో కలిసి సాంప్రదాయం, ఆకర్షణయంగా భారీ స్థాయిలో బతకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అరుణ మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఆడబిడ్డలు చిన్నవారు, పెద్దవారు అందరు కలిసి ప్రకృతిని ఆరాధించేదే బతుకమ్మ పండుగ అన్నారు. ప్రతి మహిళ సాంప్రదాయంగా సంతోషంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ, ప్రకృతిని ఆరాధించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ, స్వప్న, స్రవంతి, రమ్య, మేఘన తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ

**- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు**



చెన్నారావుపేట, అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండల మండల పరిధిలోని గ్రామ గ్రామాన బతుకమ్మ సంబరాలు హోరెత్తించాయి. గురువారం తంగేడు, గునుగు, కట్ల, బంతి, చామంతి, సీతజడలు వంటి పూలతో గ్రామాలు పూర్తిగా పూలవనంలా రూపాంతరం చెందాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబరాలు సద్దుల బతుకమ్మతో ముగిసింది. పువ్వులను పూజించే పండుగ బతుకమ్మ పండుగగా పేరొందింది. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడపిల్లలు మహిళలు ఒక్కచోట చేరి నీటి ప్రాంతాల వద్దకు చేరి బతుకమ్మ పండుగను అత్యంత సంతోషంగా జరుపుకున్నారు. ఆకరణ గౌరమ్మను గంగమ్మ ఒడిలోకి చేర్చారు.

### రాయపర్తి మండలంలో..

మండలంలోని అన్ని గ్రామాలలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి ఉయ్యాల పాటలతో అలరించారు. డప్పు చప్పులు, డీజే మోతలతో మహిళలు, చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సమీప చెరువుల్లో గౌరమ్మను నిమజ్జనం చేశారు. సంబరాలు జరుపుకునే ప్రాంతాల్లో మహిళలకు, చిన్నారులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

# 7వ వార్డు శుభ్రం చేయండి సారూ...

**- పండగ పూట వర్ధన్నపేట పట్టణ 7వ వార్డు ప్రజల ఆవేదన**





వర్ధన్నపేట, అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని 7వ వార్డు లో అపరిశుభ్రత అలుముకుంది. గురువారం పండగ పూట పాత సమస్యలే తలెత్తాయి. గత ఏడాది నుంచి పరిశుభ్రత పనులు లోపించాయని మొరపెట్టుకున్నా, అటు మున్సిపల్ అధికారులు, ఇటు వార్డు కౌన్సిలర్ ఎవ్వరు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి, ప్రతిరోజు దోమల బారిన ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. వాస్తవానికి చెప్పాలంటే ప్రతిరోజు వివిధ రకాల సమస్యలతో జీవనం కొనసాగిస్తున్నామని ఆరోపిస్తున్నారు. సీజనల్ వ్యాధుల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, జాగ్రత్త చర్యలు పాటించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. కేవలం పరిశుభ్రత అంటే ప్రకటనలకు మాత్రమే పరిమితమైపోయింది. ఆచరణలోకి వస్తే గ్రామపంచాయతీలు కావచ్చు, మున్సిపాలిటీ పరిధి కావచ్చు ఎక్కడ పరిశుభ్రత పనులు కొనసాగించడం లేదని విమర్శ చేస్తున్నారు. గత సంవత్సర కాలం నుంచి ఇప్పటివరకు సైడ్ డ్రైనేజ్, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, దుర్వాసనలు, రోడ్డు సౌకర్యం లేక బురదలో నడుస్తూ రోజులు గడుస్తున్నాయని అంటున్నారు. మున్సిపల్ పట్టణ పరిధిలో ఉంటున్నామే తప్ప, ఎలాంటి సౌకర్యాలు లేకుండా జీవిస్తున్నామని బొంత రవి, ఆలకుంట సుధాకర్, ఆలకుంట బోడ య్యకయ్య, ఆలకుంట శ్రీను, ఓర్సు సుధాకర్, ఓర్సు యాకయ్య, బొంత కోమల, ఓర్సు అయిలమ్మ, బొంత కమలమ్మ, బొంత ఉప్పలమ్మ, శివరాత్రి వెంకటమ్మ, శివరాత్రి, శివరాత్రి యాకయ్య, లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత చెప్పినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు, పాలకులు పట్టించుకోవడం లేదంటున్నారు. పట్టణ ప్రజలకు కనీసం పరిశుభ్రత పనులపై శ్రద్ధ చూపెట్టలేని నిర్లక్ష్యపు అధికారులు పాలకుల పట్ల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మీడియా ద్వారానైనా సంబంధిత ఉన్నత అధికారులు దృష్టి సారించి, మున్సిపల్ పట్టణ పరిధిని శుభ్రం చేస్తారని విశ్వసిస్తూ మీడియా ముందుకు తమ సమస్యను తీసుకురావడం జరిగిందని విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణ కేంద్రంలో పరిశుభ్రత పనులు చేపట్టాలని తెలుగు ప్రజలు సాంప్రదాయంగా భావించి అత్యంత సంబరాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ రోజు పట్టణ ప్రజలు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయమై సంబంధిత అధికారులు వర్ధన్నపేట మున్సిపల్ శుభ్రం చేసే చర్యలు చేపట్టనున్నారా వేచి చూడాల్సిందే మరి..

# కొండా సురేఖపై కెటిఆర్ పరువు నష్టం దావా



హైదరాబాద్,అక్టోబర్ 10,(జర్నలిస్ట్ వార్త): మంత్రి కొండా సురేఖ పైన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు పరువు నష్టం దావా వేశారు. ఈ మేరకు గురువారం నాంపల్లి క్రిమినల్ కోర్టులో కెటిఆర్ తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. బిఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌లను సాక్షులుగా పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం దురుద్దేశపూర్వకంగా, అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తగిన శిక్ష వేయాలని కోర్టులో కెటిఆర్ తన న్యాయవాదుల ద్వారా కేసు దాఖలు చేశారు. ఇప్పటికే కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపైన పరువు నష్టం దావా వేస్తానని కెటిఆర్ లీగల్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. వారం రోజులలోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని కెటిఆర్ తన లీగల్ నోటీసులలో పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీస్ గడువు తీరిన నేపథ్యంలో చట్ట ప్రకారం గురువారం కొండా సురేఖ పైన కెటిఆర్ క్రిమినల్ డెఫమేషన్ కేసు నమోదు చేశారు.కొండా సురేఖ గతంలో కూడా అసత్య ఆరోపణలు, అడ్డగోలు వ్యాఖ్యలు చేసినప్పుడు భారత ఎన్నికల సంఘం ఆమెకి చివాట్లు పెట్టి, మొట్టికాయలు వేసిన విషయాన్ని కెటిఆర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయపరమైన వ్యాఖ్యలు మాత్రమే కావని, తన పరువుకు భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా, ప్రణాళిక బద్ధంగా చేసిన కుట్రగా చూడాలని కెటిఆర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సురేఖ చేసిన వ్యాఖ్యలను, వాటి వెనుక ఉన్న నేరపూరిత దురుద్దేశాల పరిగణలోకి తీసుకొని, ఆమెకి చట్ట ప్రకారం శిక్ష వేయాలని ఆయన కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సురేఖ గతంలో చేసిన వ్యాఖ్యల చరిత్రను పరిగణలోకి తీసుకొని క్రిమినల్ పరువు నష్టం చట్టాల ఆధారంగా కఠిన శిక్ష వేయాలని కోరారు. త్వరలోనే వీటితోపాటు పరువు నష్టం తాలూకు సివిల్ దావాను కూడా కెటిఆర్ నమోదు చేసే అవకాశం ఉన్నది.

